# దయ్యాలకు కూడా దడేనా?

శ్రీమతి వడ్డాది సుశీలా దేవిగారు

శర్మగారు ఆనందభవనం కొనేటప్పుడు అంతా వద్దనిచెప్పినారు. ఎంచేతనంటే ఆఇంట్లో దయ్యాలు ఉన్నాయని చాలవాడుక. కాని ఆయన చాలా దేశాలుతిరిగిన నవనాగరికుడు అవడంచేత లక్ష్యపెట్టలేదు. మంచిరోజు చూడకుండానే ప్రవేశించాడు: అవును వేరేమంచిరోజుఎందుకూ? ఆయనరోజులుఅన్నీ మంచివే. దయ్యాలులేవని ఆయనకు ఒక్కడికేకాదు నమ్మకం. ఆయనభార్య, బిడ్డలకికూడా అదేవిశ్వాసం. ఇల్లుఅంతా శుభ్రంచేయించి ప్రవేశించడంవల్ల వాళ్లకు ఏమీ చిరాకుకలగలేదు. ఇల్లుఅంతాపరిశుభ్రముగానే ఉన్నది. ఎంతజాగ్రత్తగా పనిచేయించినా పనివాళ్ల అశ్రద్ధలు అల్లాగేఉంటాయి. ఇంట్లోప్రవేశించిన మరునాడు హాలులో నేలమీద ఎర్రనిడాగుఒకటి ఎదురుగుండా కనుపిస్తే దాసీదానిచేత శుభ్రంగా కడిగించి తీయించివేశాడు. ఆరోజు మామూలుగానే జరిగిపోయింది. మరునాడు లేచి చూచేటప్పటికి ఆడాగు మళ్లీ అక్కడేఉంది. దాసీది సరిగా కడగలేదేమోనని తను స్వయంగాకడిగిశుభ్రంచేశాడు. కాని ఆమరునాడు మళ్లీ డాగు అక్కడేఉంది. శర్మగారికి ఆయన భార్యకికూడా ఏమీతోచలేదు. ప్రతిరోజు ఆడాగు కడిగివెయ్యటము, ఆమరునాడు నిద్రలేచేటప్పటికి మళ్లీ అది తయారుకావటము జరుగుతూ ఉన్నది. దాసీదిమాత్రము "ఇందులో దయ్యాలు ఉన్నాయని నేను చెప్పలేదండీ, అమ్మగారూ," అని ఆ తర్వాతరోజునుంచి పనిమానుకుంది. శర్మగారికి, ఆయన భార్యకుకూడా అనుమానముతట్టింది. ఇదివరకల్లా దయ్యాలులేవని వాదించేవాళ్లు ఇప్పుడు చటుక్కున అనడము మానివేశారు: దయ్యాలు అనేవి ఉన్నాయని అనుమానంపట్టుకుంది. కాని భయపడలేదు.

ఒకరోజురాత్రి శర్మగారు నిద్రపోదామని పడుకున్నాడు. అప్పుడు రాత్రి 11 గంటలు అవుతుంది ఇంతే. వసారాలో ఏదో గొలుసుల చప్పుడులాగ ఆయనకు వినిపించింది. రెండునిమిషాలు ఆలోచించాడు. చప్పుడు తగ్గలేదు. పైగా అడుగుల చప్పుడు కూడా వినిపించింది. లాంతరు వెలిగించి తలుపు తీసి చూశాడు. ఎదురుగుండా వెన్నెలలో స్పష్టముగా కనుపించింది దయ్యము. ఎర్రనికండ్లు, పొడుగాటిజుట్టు, చేతులనుంచి, కాళ్లనుంచీ వ్రేళ్లాడుతూ యినపగొలుసులూ. శర్మగారి గదికేసి నడుస్తూంది. శర్మగారుమాత్రం భయపడలేదు. "అయ్యా, ఆ గొలుసులు తుప్పుపట్టినట్టు ఉన్నాయి. ఏనూనె అయినా ఎందుకు పొయ్యరు. చప్పుడు తగ్గేందుకు? ఇదిగో, ఈ కొబ్బరినూనె శీసా పట్టుకువెళ్లి ఆ గొలుసులమీద పొయ్యండి" అని ధైర్యంగాఅని నూనె సీసా ఒకటి అక్కడపెట్టి తలుపువేసుకున్నాడు శర్మగారు. దయ్యానికి ఒక నిమిషంసేపు ఏమీ తోచలేదు. తరువాత అతికోపంతో సీసాని నేలని వేసి కొట్టి వసారాలో పరుగెత్తడం మొదలుపెట్టింది. ఈ చప్పుడువిని శర్మగారి రెండవకొడుకుకి మెలకువవచ్చి దయ్యాన్నిచూచి దానిమీదకు దగ్గరఉన్న తలగడా గట్టిగా విసిరేడు. శర్మగారి కొడుకేగా మరి. బుద్ధులు ఎక్కడికి పోతాయి? ఆరోజున లేచినవేళ మంచిది కాదనుకొని దయ్యం దూరంగా పోయింది.

మర్నాడు ఉదయం. తాను ఇచ్చిన కొబ్బరినూనె సీసాని నిర్లక్ష్యంగా విసిరివేసినందుకు శర్మగారికి దయ్యముమీద కొంచెము కోపంగానే ఉన్నది. ఆ తర్వాత వారంరోజులదాకా దయ్యం అల్లరి మానివేసింది. నేలమీద ఆ ఎర్రటిడాగు విడవకుండా

కనుపించేటట్టు చెయ్యడంతప్ప ఇంకేమీ చేయడం లేదు. శర్మగారి కుటుంబాన్ని వదలగొట్టలేక పోయాము గదా అని దానికి విచారంగానే ఉన్నది. మళ్లీ ఒకరోజున బయలుదేరింది శర్మగారి కుటుంబం మీద కసితీర్చుకునేందుకు. ఈమాదిరిగా ప్లాను వేసుకుంది. మొట్టమొదట శర్మగారి కొడుకుగదికి వెళ్లి అతని గుండెలమీద ఎక్కి కూర్చోటము. తరువాత భార్యాభర్తలు పడుకున్న గదికివెళ్లి ఇద్దర్నీ చెరొక చేతిలోనూ పట్టుకుని గొంతుక పిసకటము. ఇది నిశ్చయముగా చెయ్యాలి అనుకుంది. శర్మగారి ఎనిమిదేండ్లకూతురు కమలనిమాత్రము ఏమిచేయ దలచుకో లేదు. ఆపిల్ల ఇంతవరకూ దయ్యానికి ఏమీ కోపం తెప్పించలేదు. అంతా నిద్రపోయినతరువాత శర్మగారి కొడుకుగదికి బయలుదేరింది. అతను ఇంకా నిద్రపోలేదు. తలుపుతీసేఉంది. దయ్యము తలుపు తోయ్యగానే చూచి దగ్గరఉన్న కూజామీదకు విసిరాడు. ఇల్లా జరుగుతుందని దయ్యము ఎన్నడూ అనుకోలేదు. దయ్యానికి శరీరంలేదని ఊరికే మన వాళ్లు ఏదోఅంటారు కాని శరీరంలేకపోతే మనకు ఎల్లా కనుపించుతుందేమిటి. అందుచేత శరీరంఅనేది దానికీ ఉన్నదన్నమాటే. తలవని తలంపుగా కూజా వచ్చి మీదపడటంతోటే దయ్యము కాళ్లకి బుద్ధి చెప్పింది, మిగితా ప్రోగ్రాము మానేసుకుని. దయ్యాలకి ఇల్లాంటి పరాభవం ఎన్నడూ జరిగినట్టు ఇంత వరకు ఎక్కడా వినలేదు అందుచేత దానికి మరింత విచారంగాఉంది.

శర్మగారి కూతురు కమల మర్నాడు సాయంత్రము చీకటిపడినతర్వాత యింటిచుట్టూఉన్న తోటలో ఆడుకుంటూఉంటే ఒకమూల దయ్యము విచారంగాకూర్చుని కనుపించింది. దయ్యాన్ని చూడగానే కమల పారిపోయింది. కాని అది అతివిచారముగా కూర్చోటంచూచి భయంతగ్గి దయ్యాన్ని సమీపించి "ఎందుకు ఏడుస్తున్నావు? నువ్వు ఇంట్లో ఏమీ అల్లరిచేయకుండాఉంటే మావాళ్లు ఏమీ చెయ్యరు నిన్ను" అన్నది. అప్పుడు దయ్యము "ఏమిటీ, అల్లరిచేయకూడదూ? మనుష్యుల్ని భయ పెట్టకూడదు? జనాన్ని కష్టపెట్టేందుకు కాకపోతే నేను ఎందుకు ఉండటము?"

"ఇల్లా ఎన్నాళ్లుఉంటావు నువ్వు, అందరినీ ఏడిపిస్తూనూ?"

"ఇప్పటికి 300 ఏళ్లనుంచి ఉన్నాను. ఇంకా ఎంతకాలం ఉండాలో నాకే తెలియదు. ఇదివరకు నేను బ్రతికిఉన్నప్పుడు చేసిన పాపాలికి ఫలితంగా ఇల్లా దయ్యంగాఉన్నాను."

"పాపాలకి ఫలితంగా దయ్యంఅయితే ఇప్పుడు నువ్వు చేస్తూఉన్న పనులుమాత్రం పాపాలుకావూ? జనులని భయపెట్టడం, ఏడిపించటం, కష్టపెట్టడం మాత్రం పాపంకాదూ? దయ్యంఅయికూడా మరి పాపంచేస్తే నీకు ముక్తి ఏంకలుగుతుంది. ఇప్పుడు నువ్వుచేసే పుణ్యంఏమిటి?"

"ఏమో వాటికి జవాబు నేను చెప్పలేను. నువ్వు అమాయకపుపిల్లవు. గనుక, నువ్వు నన్నుగురించి దైవాన్ని ప్రార్థించితేమాత్రం నాకీ దయ్యపుజన్మ పోతుంది. జనానికి ఏమీ బాధఉండదు. నీప్రార్థన దేవుడు తప్పకుండా వింటాడు."

"ఎవరికైనా సహాయంచెయ్యటం నాకు ఇష్టమే. నిన్నుచూస్తే నాకు జాలివేస్తోంది. ఈవేళ రాత్రి తెల్లవార్లూ నీకోసం ప్రార్థిస్తాను" అని కమల చెప్పి వెళ్లింది.

అనినమాట తప్పకుండా కమలా ఆరాత్రంతా దైవాన్ని వేడుకుంటూ కూర్చుంది.

ఆతర్వాత ఎన్నడూ దయ్యం ఎవరికీ కనుపించలేదు.